అయోధ్యలో కన్నడ రుచులు

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామమందిర దర్శనానికి వెళ్లే దక్షిణభారత వాసుల సౌకర్యార్థం ఉడుపి హోటల్ అందుబాటులోకి వచ్చిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. శనివారం ముథోళకు చెందిన లోకాపుర గుణకరశెట్టి ఏర్పాటు చేసిన హోటల్‌ను ఆయన ప్రారంభించారు. రామమందిరానికి 500 మీటర్ల దూరంలో రామపథ రోడ్డులో ఉడుపి అయోధ్య ఫుడ్ ప్యాలెస్ పేరిట ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు.

స్వయంగా నిర్మాణం..

తేలిగ్గా ప్రయాణం..!



కంకణవాడి - గుహేశ్వర నడుగడ్డ మధ్య గ్రామస్థులు నిర్మించిన వంతెన

- బాగల్కోట జిల్లాలో చేయి..చేయి కలిపిన గ్రామస్థులు
- తేలియాడే వంతెన నిర్మించి ఎందరికో ఆదర్శం
- సులభంగా గ్రాసం, చెరకు రవాణా



రెండు బోట్ల అనుసంధానంతో చెరకు ట్రాక్టర్ తరలింపు

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరకర్ణాటక ప్రాంతంలో సుదూరంగా కృష్ణానది పరవళ్ళు తొక్కుతోంది. వందలాది గ్రామాలకు చెందిన ప్రజలు నదికి ఇవతలవైపు నివసిస్తుంటే అవతలిగట్టులో పంట పొలాలు సాగు చేస్తారు. వర్షాకాలంలో ఒడ్డు దాటాలంటే ఎన్నెన్నో కష్టాలు అనేలా ఉంటుంది వారి జీవనం. నది దాటేందుకు జిల్లాకు ఒకటి రెండు చోట్ల మాత్రమే వంతెనలు ఉండడంతో సుదూరం తిరిగి రావాల్సిన పరిస్థితి ఉంటుంది. మరోవైపు వర్షాకాలంలో ఒక గ్రామంనుంచి దాటాలంటేనే సమస్య ఉంటుంది. ఇలా ఏళ్ల తరబడి నాటు పడవలు, తెప్పలు, చిన్నపాటి బోట్ల ద్వారానే గట్టుదాటే సాహసాలు చేస్తున్నారు. ఇలాంటి నాటు పడవలు, తెప్పల ద్వారా ఒడ్డుకు చేరేదాకా ప్రాణాలు అరచేత పట్టుకోవాల్సిందే.

బాగల్కోట జిల్లా జమఖండి తాలూకాలో 1983లో కంకణవాడి నుంచి గుహేశ్వర నడుగడ్డ వైపు వెళ్లేందుకు ఏడుగురు మహిళలు తెప్పలో ప్రయత్నించారు. ఒక్కసారిగా తెప్ప మునగడంతో వారంతా నీట మునిగి మృత్యువాత చెందారు. ఈ దారుణసంఘటన తర్వాత అప్పటి ఎమ్మెల్యేతోపాటు గ్రామస్థులు చొరవ చూపి జమఖండి తాలూకా చిక్కపడసలగి వద్ద 1989లో రైతులు సొంత నిధులతో వంతెన నిర్మించారు. దేశంలో రైతులే నిర్మించుకున్న తొలి బ్యారేజ్‌గా జాతీయస్థాయిలో అప్పట్లో పేరొందింది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి బాగల్కోట జిల్లా జమఖండి తాలూకా కంకణవాడి గ్రామస్థులు ఆల్మట్టి బ్యాక్‌వాటర్‌లో తేలియాడే వంతెనను నిర్మించుకుని ఆదర్శంగా నిలిచిరు.

నడుగడ్డలో ఉండే పంట పొలాలవైపు కంకణవాడికి తిరిగి రావడంతోపాటు పిల్లలు పాఠశాలకు వెళ్లడం ఇక్కడ నిత్యకృత్యాలు. ఈ ప్రాంతంలో విస్తారంగా సాగు చేసే చెరుకు తోటల పనులకు వెళ్లేందుకు, చెరుకును ఫ్యాక్టరీకి తరలించేందుకు ఆల్మట్టి బ్యాక్‌వాటర్ దాటుకుని వెళ్లాల్సి ఉంది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి పాలకులకు విన్నవిస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఆల్మట్టి బ్యాక్‌వాటర్‌లో వంతెన నిర్మాణ విషయం బెంగళూరు విధానసౌధలోనే కాకుండా బెళగావిలో జరిగే శాసనసభ శీతాకాలసమావేశంలో చర్చకు వచ్చింది.

ప్రభుత్వాలు, పాలకులను నమ్ముకుంటే సమస్య పరిష్కాం కాదని భావించారు. గ్రామస్థులంతా కలసి చెరుకు రవాణాతోపాటు ఏటా సాగుకు అనుకూలంగా ఉంటుందని రెండు బోట్లు కొనుగోలు చేసేందుకు చందాలు వేసుకుని గుజరాత్‌కు వెళ్లారు. వీరికి అవసరమైన బోటు లభించకపోవడంతో వెనుతిరిగారు. చివరకు ఇదే ప్రాంతం జంబగిలో ఉండే రెండు బోట్లను అమర్చుకుని ట్రాక్టర్ల ద్వారా చెరుకు రవాణాతోపాటు ప్రజలు సునాయాసంగా ఈ గట్టునుంచి ఆ గట్టుకు చేరుకుంటున్నారు. గతంలో ఒక టన్ను చెరుకును గట్టు అవతలకు చేర్చేందుకు రూ.700-800 ఖర్చు చేయాల్సి ఉండేది. ప్రస్తుతం రెండు బోట్ల అనుసంధానంతో సునాయాసంగా ట్రాక్టర్‌ను గట్టుకు చేర్పించడం ద్వారా కేవలం రూ.200ఖర్చుతో సాధ్యమవుతోంది. చెరుకు రవాణా సునాయాసమయ్యిందిని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుహేశ్వర జాతర సందర్భంగా బ్యాక్‌వాటర్‌లో బ్యారెళ్లపై (పెద్ద నీటి డ్రమ్ములు) తెప్ప నిర్మించేవారు. అదే తరహాలోనే తేలియాడే వంతెన నిర్మిస్తే బావుంటుందని వారు ఆలోచించారు. కనీసం రూ.30లక్షల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రూ.15లక్షలు సహకార సంఘం ద్వారా రుణం తీసుకుని మరో 15లక్షల రూపాయలు దేవాలయ నిధులను రుణం రూపంలో తీసుకుని పనులు పూర్తి చేశారు. బ్యారెళ్ళు, ఐరన్‌తో పట్టీల రూపంలో ఏర్పాటు చేసి 600 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో తేలియాడే వంతెన నిర్మించారు. దీనిపై ద్విచక్రవాహనాలు, ప్రజలు ఎప్పుడైనా నడిచి వెళ్లేందుకు సులభతరమైంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు తీరాయి. గట్టు అవతల నివసించేవారు ఎప్పుడైనా గ్రామంవైపు వచ్చేందుకు తేలియాడే వంతెన ద్వారా వీలు కల్పించినట్లయ్యింది. పశువులకు గడ్డిసేకరణతోపాటు పాలను డైరీకి చేర్చేందుకు మార్గం సులభతరమయ్యింది. చెరుకు రవాణాకు విధిస్తున్న సుంకంలో రూ.20లక్షలు సేకరించారు. నిర్వహణకోసం రూ.5లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతానికి రూ.15లక్షల రూపాయల రుణం తీర్చారు. మిగిలిన రుణం తీర్చేందుకు చెరుకు రవాణాకు టన్నుకు 50 రూపాయలు చొప్పున పన్ను చెల్లించేలా నిర్ధారించారు. తేలియాడే వంతెన సంచారానికి అనుకూలమైంది.

కంకణవాడి గ్రామస్థులు 500కుపైగా ఎకరాలలో ఆల్మట్టి బ్యాక్‌వాటర్‌పై నడుగడ్డ ఉంది. అక్కడ చెరుకుతోపాటు వివిధ పంటలు సాగు చేస్తారు. 10వేల టన్నుల చెరుకు ఉత్పత్తి అవుతుంది. 250కుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. 25మంది పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారు. దాదాపు 300 గేదెలను పోషిస్తున్నారు. రోజూ 1500 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతోంది. గతంలో జనసంచారం కోసం ఒక చిన్నబోటు ఉండేది. సాయంత్రం 6 గంటలకు నిలిపివేసేవారు. రాత్రి 7 గంటలు దాటితే ఎక్కడివారు అక్కడే అనేలా ఉండేది. ఉదయం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి కొనసాగేది. ఆల్మట్టి జలాశయానికి ముందు నీరు ఉధృతంగా ప్రవహించేది. ప్రస్తుతం కృష్ణనదికి అనుబంధంగా 2004లో జనసంచారానికి ఇబ్బంది ఏర్పడింది.





గోవిందరాజులు (ఫైల్) ఆర్‌వీ యోగేష్ (ఫైల్) వెంకటస్వామినాయుడు (ఫైల్)

విదేశీయాత్ర విషాదాంతం..!

- బ్యాంకాక్ నుంచి తిరిగి వస్తూ ముగ్గురి దుర్మరణం
- ఇద్దరు ప్రముఖ వైద్యులు, మరొకరు న్యాయవాది
- అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద ఘోర ప్రమాదం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

చిన్ననాటి స్నేహితులతో సరదాగా గడిపిన విదేశీ యాత్ర విషాదంతో ముగిసింది. అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురి మృతితో విమ్స్ ఆసుపత్రిలో రోదనలు మిన్నంటాయి. వారిలో ఇద్దరు పేరున్న ప్రముఖ వైద్యులు..



రోదిస్తున్న వృద్ధురాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

6

మృత్యువులోనూ వీడని స్నేహం..



రాజాజీ నగర్ ఇస్కాన్ ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న భక్తులు

హిందువులకు రక్షణ కల్పించాలి

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని రాజాజీనగర్ ఇస్కాన్ మందిరంలో భక్తులు నిరసన చేపట్టారు. విచక్షణా రహితంగా దాడులు చేస్తూ హిందూ గురువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

7



ఊరేగింపులో మంజునాథస్వామి

ధర్మస్థళలో భక్తుల సందడి

వైభవంగా లక్ష దీపోత్సవం

దక్షిణకన్నడ జిల్లా ధర్మస్థళ మంజునాథ స్వామి ఆలయంలో కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకుని లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. మూలవిరాట్టుకు మహాపర్వ విశేషపూజలు నిర్వహించారు.

బంగారు పతకం సాధిస్తే రూ. 6 కోట్లు

- ఒలింపిక్స్‌లో విజేతలకు భారీ ప్రోత్సాహకం
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య హామీ



పురస్కార గ్రహీతలతో సీఎం

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించే వారికి 6కోట్ల రూపాయలు ప్రోత్సాహకం అందజేస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. కర్ణాటక ఒలింపిక్స్ సంస్థ నగరంలోని యవనికలో ఆదివారం పురస్కారాల ప్రదానం సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామని అందుకు అనుగుణంగానే బడ్జెట్‌లో గ్రాంట్లు కేటాయిస్తున్నామన్నారు. కర్ణాటక ఒలింపిక్స్ సంస్థ 22ఏళ్లుగా పురస్కారాలు ప్రదానం చేస్తోందన్నారు. ఒలింపిక్స్ చైర్మన్‌గా గోవిందరాజు క్రీడారంగానికి సేవలందిస్తున్నారన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీ వెళ్తా... అన్నీ చర్చిస్తా: యత్నాళ్

ఆల్మట్టిలో 522 మీటర్ల నీటి నిల్వకు కుట్ర

- బీజేపీ ఎంపీ గోవింద కారజోళ ఆగ్రహం

7

హాసన్ సభను విజయవంతం చేయండి: డీకే

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాసన్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని డీసీఎం డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. కేపీసీసీలో ఆదివారం హాసన్‌తోపాటు అనుబంధ జిల్లాల ముఖ్యనాయకులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశాన్ని జరిపారు. అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీకి చెందిన నాయకులు, ముఖ్యులు హాసన్ సభ జరిపే ఏర్పాట్లలో ఉన్నారన్నారు. జిల్లా మంత్రులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారన్నారు. నాలుగురోజులుగా ఢిల్లీలో ఉన్నామని అందుకే హాసన్ సభకు సంబంధించి ముందుగా చర్చించలేదన్నారు. త్వరలోనే సండూరు, శిగ్గావిలలో ఓటర్లకు కృతజ్ఞతా సమావేశాలను జరపదలిచామన్నారు. చన్నపట్టణలో అభినందన సమావేశాన్ని సీపీ యోగేశ్వర్, డీకే సురేశ్ పర్యవేక్షిస్తున్నారన్నారు. సాధ్యమైనంత త్వరలోనే జిల్లా తాలూకా పంచాయతీ ఎన్నికలు జరపదలిచామన్నారు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్ష పదవి లాంటివి ఖాళీ లేవని అంతకుమించి మాట్లాడేది లేదంటూ దాటవేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎం డీకే

రూపురేఖలు మారిన సభ

సీఎం సిద్దరామయ్యపై ముడా అవినీతి వివాదంలో కేసులు, విచారణలు సాగుతున్న తరుణంలో ఆయనను రాజకీయంగా దెబ్బ తీయాలనే కుట్ర సాగుతోందని, స్వాభిమాన సదస్సు నిర్వహించాలని ఆయన అభిమానులు భావించారు. తొలుత సిద్దరామయ్య అభిమానులు, కురుబ కులస్తుల ద్వారా జరుగుతుందని ప్రచారం సాగింది. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లకు అనుమతులకోసం పార్టీ, ప్రభుత్వంతో సంబంధం లేని విధంగా అధికారులను కోరారు. అయితే పార్టీతో సంబంధం లేకుండా జరిపితే ఏమని సంకేతం ఇచ్చినట్లు కొందరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఒకానొక దశలో సభను నిలిపివేయించాలనే కుట్ర సాగింది. ఇదే విషయమై ఢిల్లీ వెళ్లిన సీఎం, డీసీఎంలు పార్టీ అధిష్ఠానంతో చర్చించారు. హాసన్‌సభకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తూనే పరోక్షంగా పార్టీ ద్వారా మాత్రమే జరపాలని మెలిక పెట్టింది. దీంతో ఒక్కరోజులోనే హాసన్ సభ రూపురేఖలు మారిపోయాయి. అది కూడా సిద్దరామయ్య స్వాభిమాన సదస్సుగా జరపాలని తీర్మానించారు. కానీ మలుపులు తిరిగి అది కాస్త పార్టీ సమావేశంగా మారిపోయింది.

నిజం చెప్పండి..!

- లోపం వైద్యానిదా.. మందులదా..?
- బాలింతల మృతిపై ప్రతిపక్ష నాయకుడు అశోక్

బళ్లారి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైద్య లోపం వల్ల బాలింతలు మృతి చెందారా..? మందుల కారణంగా కన్ను మూశారా..? నాతో నేరుగా నిజం చెప్పండి అంటూ వైద్యులను ప్రతిపక్ష నాయకులు అశోక్ ప్రశ్నించారు. బాలింతల మృతిపై ఆరా తీయడానికి ఆయన ఆదివారం బళ్లారి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన బాలింతల మృతికి నాసిరకం మందులైనా కారణమని, వైద్యుల నిర్లక్ష్యం అయినా ఉండవచ్చన్నారు. సర్జన్ బసిరెడ్డితో పాటు ఓటీ వైద్యులతో ఆయన మాట్లాడారు. ఒకే నెలలో నలుగురు బాలింతలు మృత్యువాత పడడం బాధాకరమన్నారు. ఈ ఘటన వైద్య శాఖలో లోపాలను ఎత్తి చూపుతోందన్నారు. ఇందులో దాచడానికి ఏమీ లేదన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఐవీ ఫ్లూయిడ్స్ నాణ్యత లేదని అక్కడ బ్యాన్ చేశారని, మరి మన రాష్ట్రంలో వాడడం ఎందుకని ప్రశ్నించారు. బాలింతల మృతిపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

రాష్ట్రంలో 10 నెలల్లో 111 మంది నవజాత శిశువులు చనిపోయారు. బళ్లారిలో నలుగురు బాలింతలు కన్ను మూశారని ఆవేదన వ్యక్తం చేశారు.



వైద్యులతో చర్చిస్తున్న ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్

రాష్ట్రంలో మెడికల్ మాఫియాపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడడం మంచిది కాదన్నారు. మరణించిన బాలింతలకు కేవలం రూ.2 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటే వదిలేది లేదని, మరణించిన బాలింత కుటుంబాలకు నష్టపరిహారం కింద రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో పేదలకు అందించే వైద్యంపై వైద్యులు నిర్లక్ష్యం వహించరాదని, సేవాభావంతో పని చేయాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తం ఉద్యమానికి వేనుకాడేదీ లేదన్నారు. ఆయన వెంట జిల్లా బీజేపీ నాయకులు, ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.00	1,593.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,429	607
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,507	5,467
నీటి నిల్వ (టీఎంసీలు)	93.91	14.39

ఎర్రమట్టి అక్రమ రవాణాను అడ్డుకోండి



ఆదోని రోడ్డులో అక్రమంగా టిప్పర్‌లో తరలిస్తున్న ఎర్రమట్టి

సిరుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. సిరుగుప్ప తాలుకాలో రారావి, బాగేవడి, హళేకోట ప్రాంతాలలో ఎర్రమట్టి అక్రమంగా రేయింబవళ్లు రవాణా జరుగుతున్నా మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కు ఒక లారీ లోడుకు రూ.6వేలు నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. ఇంత బహిరంగంగా అక్రమరవాణా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారి ఈ విషయంపై దృష్టి సారించి అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

ఓవర్‌లోడ్‌పై చర్యలు తీసుకోండి



ట్రాక్టర్‌లోకి వరి ధాన్యాన్ని ఎక్కిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓవర్‌లోడు తో వెళుతున్న ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సిరుగుప్ప తాలుకాలో వరి దిగుబడులు అధికంగా రావడంతో విచ్చలవిడిగా అధిక లోడు వేసుకుని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. దీంతో ప్రధాన వీధుల్లో బస్తాలు జారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీవో, పోలీసు అధికారులు ఈ విషయంపై చూసీ చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఓవరులోడు ట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధి కుక్కల బెడద.. ప్రజల ఆందోళన



నగరంలో సంచరిస్తున్న వీధికుక్కలు

బళ్లారి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల బెడద జనాలను బెంబేలెత్తిస్తోంది. వృద్ధులు, పిల్లలు రోడ్లపై నడవాలంటే కుక్కల దెబ్బకు హడలెత్తుతున్నారు. కుక్కలు మందలు మందలుగా రోడ్లపై తిరుగుతూ వాహనదారులకు తీవ్ర ఇబ్బంది పెడుతు న్నాయి. కుక్కల కారణంగా పలుసార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. పలు వార్డుల్లో కుక్కల సమస్య తీవ్రమైనా, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని నగరవాసులు వాపోతున్నారు. ప్రధానంగా సంఘం సర్కిల్, గవియప్ప సర్కిల్, కొలిమిబజార్, మిల్లర్ పేట, అనంతపురం రోడ్డు ఎంజీ కూడళ్లల్లో కుక్కల బెడద తీవ్రంగా మారింది. ఇరుకైన, రద్దీగా ఉన్న రహదారుల్లో నుంచి కుక్కలు అమాంతం పరిగెత్తి వాహనాల మీదకు వస్తుండంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. నగరంలో అతి ముఖ్యమైన రహదారి గడిగి చెన్నప్ప సర్కిల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అధికారులు వీధికుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సంఖ్య శరవేగంగా పెరుగుతోందని, నగర పౌరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విదేశీయాత్ర విషాదాంతం..!

- ●బ్యాంకాక్ నుంచి తిరిగి వస్తూ ముగ్గురి దుర్మరణం
- ●బళ్లారికి చెందిన ప్రముఖ వైద్యులు, మరో న్యాయవాది
- ●అనంతపురం జిల్లా విడపనకల్లు వద్ద ఘోర ప్రమాదం
- ●శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

బళ్లారి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదంగా, ఆనందం గా గడపడానికి విదేశాలకు వెళ్లిన వారి యాత్ర విషాదంగా ముగిసింది. రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి ఆయా కుటుంబాల్లో తీరని శోకం నింపింది. ఆదివారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు సమీపంలో తెల్లవారుజామునే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బళ్లారి విమ్స్ ఆసుపత్రిలో కేన్సర్ విభాగం హెచ్‌ఓడీ రాష్ట్రంలోనే కేన్సర్ సర్జన్ ప్రొఫెసర్‌గా పేరున్న డాక్టర్ ఇ. గోవిందరాజులు,(52) విమ్స్ కంటి విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్.బి యోగేష్ (52), న్యాయవాది, ఎం. వెంకటనారాయణ(49) ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్న ఆయుర్వేదిక్ వైద్యుడు అమరగౌడ పాటిల్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, మృతుల బంధువులు, తోటి వైద్యులు తెలిపిన సమాచారం ప్రకారం. స్నేహితులంతా కలిసి బ్యాంకాక్‌లో ఆత్మీయ కలయికకు బయలు దేరారు. ఈనెల 26న మంగళవారం బళ్లారి నుంచి వారు వదిలారు. డాక్టర్ గోవిందరాజులు సొంత కారులో స్నేహితులు కలిసి బెంగళూరుకు వెళ్లి అక్కడ కారు పెట్టి విమానంలో బ్యాంకాక్‌కు వెళ్లారు. ఆదివారం 12.30 గంటలకు బెంగళూరు విమానాశ్రయంలో దిగి కారులో బళ్లారికి బయలు దేరారు బెంగళూరు నుంచి బళ్లారికి వయా అనంతపురం మీదుగా ప్రయాణిస్తున్నారు. ఇంటికి మరో 40 నిమిషాల్లో చేరుకునే లోగా వీరిని మృత్యువు ప్రమాద రూపంలో వెంబడించింది. వీరు ప్రయాణిస్తున్న కారు బళ్లారి వైపు వచ్చే దారిలో రోడ్డు పక్కన కుడివైపు ఉన్న వేపచెట్టును ఢీ కొనింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో నలుగురున్నారు. కారును గోవింద రాజులు నడుపుతుండగా పక్కన మరో వైద్యుడు యోగేష్ ముందు కూర్చున్నారు. మిగిలిన ఇద్దరు వెనక సీటులో కూర్చున్నారు. ప్రమాదం ఆదివారం వేకువ జామున 3 గంటలా 15 నిమిషాలకు జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే డాక్టర్ గోవిందరాజులు ఐఫోన్ నుంచి బార్య ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లింది. అప్రమత్తమైన ఆమె గోవిందరాజులకు ఫోన్ చేసింది. కానీ ఆయన లిఫ్ట్ చేయలేదు. అనుమానం



వైద్యుడు అమరగౌడ పాటిల్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వచ్చిన ఆమె కూతురుతో బయల్దేరి జీపీఎస్ లోకేషన్ ఆధారంగా ప్రమాద స్థలానికి చేరుకుంది. చిమ్మచీకటి.. అంతా పొగమంచు కమ్ముకుంది. ఎక్కడ ప్రమాదం జరిగిందో గుర్తించడం కష్టంగా మారింది. అయినా ఆమె అక్కడే ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లింది. పోలీసులనూ విచారించింది. అప్పటికీ ఎవరికీ తెలియదు. కానీ తిరిగి ఫోన్ జియోలోకేషన్ ద్వారా పొలాల్లో పడిపోయిన కారును గుర్తించింది. మిగిలిన విమ్స్ వైద్యులకు సమాచారం చేరవేడంతో వారు కూడా అక్కడికి చేరుకున్నారు. పొలాల్లో రక్తపు మడుగుల్లో కారులోనే కుప్పకూలి ఉన్న వారిని బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్నారని ఆశించి బతికుంచుకునేందుకు కారుల్లో విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు గుర్తించారు. కొన ఉపిరితో ఉన్న అమరేగౌడ పాటిల్‌ను



మృతదేహాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత నారా సూర్యనారాయణ రెడ్డి



విషాదంలో గోవిందరాజులు భార్య, పిల్లలు

ట్రామాకేర్ అసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. మృతుడు డాక్టర్ ఇ. గోవిందరాజులు భార్య రచన కూడా ప్రభుత్వ వైద్యురాలు, ఆమే విమ్స్‌లో డెంటల్ విభాగంలో అసోసిఏట్ ప్రొఫెసర్, డాక్టర్ యోగేశ్వ భార్య కూడా వైద్యురాలు, ఆమె విమ్స్ డెంటల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విమ్స్‌లో డాక్టర్ గోవిందరాజులు, అలాగే యోగేష్ ఇద్దరూ సీనియర్ డాక్టర్లే. ఇద్దరు డాక్టర్లు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదం నెలకొంది. డాక్టర్ అమర్‌నాథ్‌గౌడ పాటిల్ ఆయుర్వేద డాక్టర్ ఆయన ప్రైవేటు క్లినిక్ పెట్టుకుని ప్రాక్టీస్ చేస్తున్నారు. డాక్టర్లు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో రోగులతో పాటు తోటి వైద్యులు నర్సులు, ఆసుపత్రి సిబ్బంది సంతాపం తెలిపారు. పలువురు నాయకులు వారి మృతిపై విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నారా సూర్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకుడు విధాన సభ ప్రతిపక్ష నాయకుడు ఆర్. ఆశోక్, మాజీ మంత్రి శ్రీరాములు, గాలి జనార్ధన్‌రెడ్డి తదితరులు ఆసుపత్రిలో వారి మృతదేహాలను సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహం...!

ఆ..ముగ్గురు ప్రాణ స్నేహితులు.. చదువుకునే నాటి నుంచి వారి స్నేహం కొనసాగుతోంది. అయితే వారి స్నేహాన్ని మృత్యువు కూడా విడదీయలేకపోయిందని వైద్యుల మృతిపై పలువురు అభిప్రాయపడ్డారు. అనంతపురం జిల్లా విడపనకల్లు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వైద్యులు బళ్లారి విమ్స్‌లోనే మెడిసిన్ చేశారు. పీజీ కూడా ఇక్కడే చేశారు. గోవిందరాజులు కేన్సర్ సర్జన్ కాగా, యోగేష్ కంటివైద్య విభాగాధిపతి. వెంకటస్వామి నాయుడు వృత్తి వేరైనా వీరితో స్నేహబంధం అపారమైనది. ఆదివారం మధ్యాహ్నం వారి మృతేహాలను బళ్లారికి తీసుకువచ్చారు. బంధువులు, స్నేహితులు, వైద్య సిబ్బంది కన్నీరుమున్నీరయ్యారు. మా డాక్టన్‌ను మాకు ఇవ్వండయ్యా అని ఓ వృద్ధురాలు కొంగుచాచి వేడుకుంటుంటే పలువురు గుండెలు పడిలేలా రోదించారు.

వైద్యులిద్దరికీ రాష్ట్రస్థాయిలో మంచి పేరుంది. గోవిందరాజులు పేదరికంలో పుట్టి పెరిగిన వ్యక్తి. హస్టల్‌లో చదువుకుని ఉన్నత స్థాయి వరకూ ఎదిగారు. పేదలకు వైద్యం అందిచడంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే యోగేష్ నిబద్ధత కలిగిన వైద్యుడు. ఇక అమర్‌నాథ్ పాటిల్ బిఎఎంస్ పూర్తి చేసి వైద్య వృత్తిలోనే కొనసాగుతున్నారు. వెంటకస్వామి నాయుడు చదివింది న్యాయ వృత్తి అయినా వీరితో స్నేహంగా ఉండేవారు. వెంకటస్వామి నాయుడుది సొంత ఊరు ఉరవకొండ తాలూకా మొపిగి గ్రామం. ఇక్కడే చదువుకుని ఇక్కడే స్థిరపడ్డారు. పాత స్నేహితులంతా బ్యాంకాక్‌లో కలవాలని మూడు నెలల కిందే ప్లాన్ చేసుకున్నారు.

విమానాశ్రమం నుంచి వీడియోకాల్..

బెంగళూరు విమానాశ్రయం నుంచి డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ యోగేష్, అమర్‌నాథ్ పాటిల్, ఇలా అందరూ విడియోకాల్‌లో మాట్లాడారని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటస్వామి నాయుడు కుమారుడు యూఎస్‌ఏలో ఉండడంతో అక్కడికి కూడా ఆయన వీడియో కాల్‌లో మాట్లాడారు. తెల్లవారితే ఇంట్లో ఉంటామన్న వారు ఇలా మృత్యువాత పడ్డారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దట్టమైన పొగ మంచు కారణంగానే దారి కనపడక ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నాయకులు నారా సూర్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకుడు విధాన పరిషత్ ప్రతిపక్ష నాయకుడు ఆర్ ఆశోక్, గాలిజనార్ధన్‌రెడ్డి, బి. శ్రీరాములు, ఇతర ప్రముఖులు వారికి నివాళి అర్పించారు.

పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్

బళ్లారి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీతీర ప్రాంతాల్లో ప్రస్తుతం వరి కోత ప్రారంభమైంది. మిగిలిన వరి గడ్డిని(పశుగ్రాసం) బయటి జిల్లాలకు కూడా రవాణా చేస్తుండడంతో గిరాకీ పెరిగింది. తాలూకాలోని వర్షాదార గ్రామాలతో పాటు బయటి జిల్లాల సరిహద్దు గ్రామాలకు చెందిన రైతులు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్నారు. తుంగభద్ర నదీ జలాలపై ఆధారపడి చాలా మంది వరిసాగు చేస్తున్నారు. దళారులు పండించిన మగిలిన వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి ఇతర జిల్లాల రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని సరిహద్దు జిల్లాలైన కర్నూలు, అనంతపురంలోని వివిధ తాలూకాల గ్రామాలకు వందలాది ట్రాక్టర్లలో పశుగ్రాసాన్ని తరలిస్తున్నారు. వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమపై ఆధారపడిన వారు అనివార్యంగా వరి గడ్డిని అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వరి గడ్డి ట్రాక్టర్‌కు మధ్య దళారులు సుమారు రూ 10నుంచి 12వేలు వసూలు చేస్తున్నారు, రైతు కంటే ఎక్కువ సంపాందిస్తున్నారు. అయితే ప్రస్తుతం రైతులు వరి కోతలు చేస్తుండగా దళారులు ఏకంగా ఎకరాల కొద్దీ పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతుల దగ్గరకు వెళితే పశుగ్రాసం



పశుగ్రాసాన్ని తీసుకెళుతున్న రైతు

కొనుగోలు చేశామని చెబుతున్నారు. మధ్య దళారుల వద్దకు వెళ్ళినప్పుడు ఎక్కువ వసూలు చేస్తున్నారు. దళారుల బెడదను తప్పించాలని పశుగ్రాసం కొనుగోళ్లు దారులు కోరుతున్నారు.

బీజేపీ గ్రామ పంచాయతీ సభ్యులు కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

బళ్లారిరూరల్/గాంధీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సిరివరం గ్రామ పంచాయతీ బీజేపీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి నాగేంద్ర నివాసంలో ఆదివారం చేరారు. బీజేపీ సభ్యులు వడ్డే సుధాకర్, వన్నూరుస్వామి, రమేష్, వీరబసప్ప, శంకరప్ప గౌడ, వన్నూరప్ప, గాదిలింగ వీరికి కాంగ్రెస్ నాయకులు ముండ్రిగి నాగరాజు, లింగదేవనహళ్లి, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు, జగన్, బోయపాటి విష్ణువర్ధన్, బోనాల నాగభూషణగౌడ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో అగ్రి గోవిందు, రామాంజనేయులు, దుర్గన్న, ముద్దమల్లయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



దీపోత్సవంలో పాల్గొన్న కల్యాణస్వామిజీ

బళ్లారిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మడికేరి ఆంజనేయస్వామి ఆలయం 22వ వార్షిక దీపోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిగుప్ప రోడ్డు సమీపంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయానికి కళ్యాణ స్వామిజీ శనివారం రాత్రి వచ్చారు. పెద్దఎత్తున ఆలయ కమిటీ పదాధికారులు అయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు.

వైభవంగా కార్తీక అమావాస్య



ఎర్రితాతస్వామి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

బళ్లారిరూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ పరిధిలోని ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో వెలిసిన చేళగుర్కి ఎర్రితాత స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి కార్తీకమాసం చివరిరోజున ముత్యాలపల్లకిని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు దీపాలు వెలిగించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కంప్లి: తాలుకా పరిధిలోని గ్రామాల్లో పట్టణాల్లో, క్యాంపులలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ప్రతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సన్నాపురం, బసవేశ్వర క్యాంపు, నారాయణస్వామి క్యాంపులో కార్తీక దీపోత్సవం చేపట్టారు. కోలాటం, భజనలు చేశారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు





పూజలందుకుంటున్న బసవేశ్వరస్వామి, ఏడుపడగల నాగప్ప

కంప్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా కంప్లి పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనగర జిల్లా కొట్టూరు గ్రామంలో బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలోని కాళికాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు. బుక్కసాగర వద్ద ఏడుపడగల నాగప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దొంగల ముఠా అరెస్టు

కంప్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇచ్చల బొమ్మనళ్లి గ్రామంలోని ఉడుసులమ్మ దేవస్థానంలో గత శుక్రవారం ఆభరణాలు దొంగలించిన ముఠాను ఎట్టకేలకు కూడ్లిగి పోలీసులు అరెస్టు చేశారు. కెంచనహళ్లి వీరేష్, సాలయ్యా కోటకు చెందిన హనుమంతు దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రూ.1.46 లక్షలు విలువ చేసే ఆభరణాలు దొంగలించినట్లు తెలిపారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చండి

కంప్లి, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీరశైవ లింగాయత సమాజాన్ని ఓబీసీలో చేర్చాలని ఇటీవల నేమకల్లుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జేఎస్‌డబ్ల్యూ జిందాల్ వద్ద ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివానంద మనవిపత్రం అందించారు. అలాగే మిగతా పథకాలకు కూడా ప్రజలకు అందేలా చూడాలని సీఎంను కోరారు.

హోసూరు జోన్

ఉపాధి అవకాశాల్లోనూ పచ్చదనం

హోసూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నేతృత్వంలో ఉపాధి కల్పించడంతోపాటు పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు యువ పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. హోసూరులో 'ఎస్' అనే సంస్థకు చెందిన యువ పారిశ్రామికవేత్తల సమావేశం ఆదివారం జరిగింది. చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా యువతకు శిక్షణ, మార్గదర్శకం చేస్తున్నారు. హోసూరు శాఖ అధ్యక్షుడు థామస్ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తల సాధనలను వివరించారు. సోలార్ రంగంలో రూ.600 కోట్ల టర్నోవర్‌తో డీఏఎస్‌హెచ్ గ్రూప్ ఛైర్మన్‌గా మంజునాథరెడ్డి స్ఫూర్తిగా నిలిచారన్నారు. మంజునాథ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సమాజంలోని యువ పారిశ్రామికవేత్తలు మరిన్ని ఉద్యోగ అవకాశాలను సృష్టించాలన్నారు. ఒక పారిశ్రామికవేత్త ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యికి పైగా కుటుంబాలకు ఉపాధి కల్పించవచ్చునన్నారు. స్కూల్ ఆఫ్ యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హోసూరు శాఖ అధినేత థామస్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు ఆసక్తి ఉన్న ఎవరైనా ఇందులో సభ్యులుగా చేరి ప్రయోజనం పొందవచ్చునన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నట్టు వివరించారు.



యువ పారిశ్రామికవేత్తల బృందం

వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజు నేపథ్యంలో డీఎంకే తరపున వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా 12 బృందాలు పాల్గొన్నాయి. బేగేపల్లి జట్టు పాల్గొనగా హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ సత్య , డీఎంకే ప్రముఖులు యువరాజు, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి, నగర పాలకులు సెందిల్‌కుమార్, త్యాగరాజు, గోపాలకృష్ణన్, రవికుమార్, కార్యదర్శులు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో బెంబేలు

హోసూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హోసూరు శివారులోని రాష్ట్ర సరిహద్దులో నిసర్గ లే అవుట్ ప్రాంతంలో చిరుత సంచారంతో స్థానికులు బెంబేలు చెందుతున్నారు. రెండురోజులుగా చిరుత సంచారంపై సీసీటీవీ ఫుట్టేజీలో నమోదైంది. సమాచారంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేవారు, ఫ్యాక్టరీలకు వెళ్లేవారు జంకుతున్నారు. లే అవుట్‌లో వెయ్యికిపైగా ఇళ్లు ఉన్నాయి. ఎప్పుడు చిరుత దాడి చేస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నిసర్గ లేఅవుట్‌లో సంచరిస్తున్న చిరుత

ఉత్సాహంగా ఎన్‌సీసీ డే



ఎన్‌సీసీ క్యాడెట్ల గ్రూప్ ఫొటో

హోసూరు డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హోసూరు రాయకోట్టై రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి డేను ఆచరించారు. శనివారం ఎన్‌సిసి విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మునిరాజు అధ్యక్షత వహించారు. నేషనల్ స్టూడెంట్ ఫోర్స్ డే వేడుకల సందర్భంగా 11 తమిళనాడు సిగ్నల్ కంపెనీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సురజ్‌నాయర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎన్‌సిసి అధికారి రాజు నేతృత్వంలో పాఠశాల అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 25 రకాల దేశవాళీ మొక్కలను నాటారు. కార్యక్రమంలో రోడ్ ట్రాఫిక్ ఎస్ఐ సత్య, రోడ్డు భద్రతా కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు.

గాడిద తల నరికిన దుండగులు

హోసూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కొత్తగొండపల్లికి చెందిన ఆనంద అనే లాండ్రీ కార్మికుడు తరతరాలుగా 20 గాడిదలను సంరక్షిస్తున్నాడు. అతను అదే ప్రాంతంల్లో ఇస్త్రీ చేస్తున్నాడు. ఇతడి ఇంటికి, గాడిదల షెడ్‌కు సుమారు అరకిలోమీటరు దూరం ఉంది. ఆదివారం ఉదయం గాడిదలను మేపేందుకు వెళ్లిన వేళ గాడిద తల తెగిపడి ఉండడంతో ఆనంద షాక్‌కు గురయ్యాడు. మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా కొందరు దుష్టపూజలకోసం కోసం నల్లరంగు గాడిద మెడను కోశారని వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశానన్నారు. గాడిద తలను నరికిన అంశం స్థానికంగా కలకలం సృష్టించింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బీ నాగిరెడ్డి (జయంతి)



ప్రముఖ తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు బొమ్మిరెడ్డి నాగిరెడ్డి 1912 డిసెంబరు 2న కడప జిల్లా కొండాపురం మండలం పొట్టిపాడులో జన్మించారు. ఆయన రూపొందించిన షావుకారు, పాతాళభైరవి, మాయాబజార్, మిస్సమ్మ, గుండమ్మ కథ వంటి సినిమాలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. చెన్నైలో విజయవాహిని స్టూడియో ఏర్పాటు చేశారు. చక్రపాణితో కలసి పెద్దసంఖ్యలో సినిమాలు రూపొందించారు. టీటీడీ ఛైర్మన్‌గా తిరుమలలో వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నిర్మించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికను, చందమామ మాసపత్రికను ప్రారంభించారు. నంది అవార్డు, దాదాసాహెబ్ ఫాల్కే, కళైమామణి తదితర అవార్డులు పొందారు. 2004 ఫిబ్రవరి 25న కన్నుమూశారు.

మర్రి చెన్నారెడ్డి (వర్ధంతి)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు కొనసాగిన మర్రి చెన్నారెడ్డి 1919 జనవరి 13న వికారాబాద్ తాలూకాలో జన్మించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. 1941లో ఎంబీబీఎస్ పొందిన ఆయన విద్యార్థి దశలో ఆంధ్రయువజన సమితి, విద్యార్థి కాంగ్రెస్‌ను స్థాపించారు. రాజకీయాలలో తనదైన ముద్ర వేశారు. 1996 డిసెంబరు 2న కన్నుమూశారు.

మోనికా సెలెస్ (పుట్టినరోజు)



అంతర్జాతీయస్థాయిలో పేరొందిన టెన్నిస్ క్రీడాకారిణి మోనికా సెలెస్ 1973 డిసెంబరు 2న యుగోస్లేవియాలో జన్మించారు. యుగోస్లేవియా, యునైటెడ్ స్టేట్స్ నుంచి ప్రాతినిధ్యం వహించి 'వరల్డ్ నెంబరు వన్'గా నిలిచారు. 16వ యేటకే ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచారు. 8 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను అందుకుని టెన్నిస్‌లో తనదైన రికార్డు నెలకొల్పారు. 2009లో ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్ పురస్కారం అందుకున్నారు. టెన్నిస్ క్రీడాకారిణిగా రిటైరయ్యారు. '30 లెజెండ్స్ ఆఫ్ ఉమెన్స్ టెన్నిస్'లో ఒకరిగా నిలిచారు.

మంత్రులపై అధిష్టానం ఆగ్రహం

» కాంగ్రెస్ భవనాల నిర్మాణంలో జాప్యంపై గుర్రు

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వంద కాంగ్రెస్ భవనాలు ఏర్పాటు చేయాలనే విషయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల నిర్లక్ష్యంపై అధిష్టానం మండిపడింది. బెళగావిలో నెలాఖరున మహాత్మాగాంధీ పాల్గొన్న కాంగ్రెస్ సభకు వందేళ్ల ప్రత్యేక కార్యక్రమం నాటికి రాష్ట్రమంతటా వంద కాంగ్రెస్ భవనాలు ఏర్పాటు చేయాలని సూచించిన విషయం తెలిసిందే. స్వయానా రాహుల్‌గాంధీ రాష్ట్రమంత్రులకు కాంగ్రెస్ భవనాల ఏర్పాటుపై సూచనలు చేశారు. ఏ జిల్లాలోనూ ఇప్పటివరకు కాంగ్రెస్ భవనాల నిర్మాణాలకు సంబంధించి కనీసమైన కసరత్తు కూడా సాగలేదు. దీంతో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాకు వారం రోజుల్లో జాబితా ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం. రాష్ట్రంలో పార్టీ ప్రగతి పెంచాలనే ఆలోచనతో 31 జిల్లాల పరిధిలో జిల్లాస్థాయి, శాసనసభ నియోజకవర్గాల కేంద్రాలలో వంద కాంగ్రెస్ భవన్‌లను నిర్మించదలిచారు. కేపీసీసీకి రెండు నెలల కిందటే ఆదేశాలు జారీ చేసినా మంత్రులు, ఎమ్మెల్యేల నిర్లక్ష్యాన్ని అధిష్టానం సీరియస్‌గా పరిగణించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రానున్న రోజుల్లో రాష్ట్రంలో పార్టీని కిందిస్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు ఇదో అవకాశంగా తీసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు. ఇందుకు అనుగుణంగా ఏఐసీసీ మార్గదర్శకాలు సూచించింది. ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఇదే విషయమై రాష్ట్ర నాయకులతో చర్చించడమే కాక ప్రాంతాలవారీగా నలుగురు ఏఐసీసీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. నిర్లక్ష్యంగా ఉన్న మంత్రుల తీరుపై అధిష్టానం మండిపడ్డంతో మంత్రులలో భయం పట్టుకుంది. ఇటీవలే మంత్రివర్గ విస్తరణ అంశంపైనా ఢిల్లీలో చర్చలు జరుగుతాయని ఆరేడుగురు మంత్రులను తొలగిస్తారనే అంశం హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా కొందరు మంత్రుల తీరుపై కేబినెట్ భేటీలోనూ సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల బీజేపీ, జేడీఎస్ నేతలు వక్ఫ్, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌తోపాటు పలు అంశాలపై నిలదీస్తుంటే మంత్రులు మౌనంగా ఉన్నారని మండిపడినట్టు తెలుస్తోంది. ఇలా మంత్రులపై ఒత్తిడి వస్తుండడంతో ఎవరిపై వేటు పడుతుందోననే చర్చ జోరందుకుంది.

ఢిల్లీ వెళ్తా... అన్ని విషయాలు చర్చిస్తా: యత్నాళ్



మీడియాతో యత్నాళ్

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీలో కొనసాగుతున్న తీరును అధిష్టానానికి వివరించనున్నట్టు పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ తెలిపారు. ఆదివారం బాగల్కోటెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఢిల్లీ వెళ్తున్నట్టు తెలిపారు. మాజీ ఎంపీలు ప్రతాప్‌సింహ, జీఎం సిద్దేశ్వర్, కుమార బంగారప్ప, ఎమ్మెల్యే చంద్రప్ప, హరీశ్‌లతో కలసి ఢిల్లీ వెళ్తానన్నారు. నాలో ఎలాంటి విబేధాలు లేవని, బీజేపీ ద్వారానే పోరాటం చేస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డు ద్వారా రైతులకు అన్యాయం చేసేలాంటి నోటీసులను వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నామన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల మద్దతు మాకు ఉందన్నారు. ఇంకా సినిమా పూర్తి కాలేదని ఇప్పటినుంచే అధిష్టానం వద్దకు వెళ్లాక తెలుస్తుందన్నారు. దావణగెరెలో మా పోరాటం సభకు కనీసం 10లక్షలమందిని చేర్చాలని భావిస్తున్నామన్నారు. మూడున్నరేళ్లపాటు ఇటీవల బీజేపీ ప్రభుత్వం కొనసాగేందుకు రమేశ్ జార్కిహొళి ఆపరేషన్‌తోనే సాధ్యమైందన్నారు. అంతకుముందు అరవింద లింబావళి, కుమార బంగారప్ప, ప్రతాప్‌సింహలతో కలసి రహస్యంగా సమావేశమయ్యారు.



పార్టీ నాయకులతో యడియూరప్ప సమావేశం

కాగా రాష్ట్రంలో తలెత్తిన విబేధాలు తారస్థాయికి చేరుతున్నాయి. విజయేంద్ర ఆదివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ నాపై యత్నాళ్ పలు ఆరోపణలు చేశారని, వాటి ఆధారాలు విడుదల చేయాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో పార్టీని దారి తప్పేలా వ్యవహరించడం సరికాదన్నారు. మరోవైపు ఆదివారం ఉదయం పార్టీ సీనియర్ నేత యడియూరప్ప డాలర్స్‌కాలనీలోని నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్‌లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీలో చోటు చేసుకుంటున్న విబేధాల గురించి చర్చించారు.

దార్శనికుడు కనకదాసు: మంత్రి

హెబ్బాళ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వి నాగేనహళ్ళిలోని గజానన యువజనసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన దార్శనికుడు, దానశ్రేష్ఠుడు భక్త కనకదాస 537వ జయంతిని నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. సమాజోద్ధరణకు కనకదాసు పాటుపడ్డారన్నారు. సమాజంలోని తారతమ్యాలపై చైతన్యం కల్పించేలా కీర్తనలు చేశారన్నారు. ఆయన జీవనం, భాషణం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డుల అధ్యక్షులు, సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బైరతి సురేశ్‌కు సన్మానం

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



శుద్ధనీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దొమ్మసంద్ర, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మౌలిక సదుపాయాలు పెంచడమే లక్ష్యమని ఎమ్మెల్యే శివణ్ణ అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకాలోని హందేనహళ్ళిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, శుద్ధతాగునీటి కేంద్రాన్ని లాంఛనంగా ఆరంభించారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో గ్రామ పంచాయతీ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో శుద్ధ తాగునీటి కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే శివణ్ణ, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి గ్రామపంచాయతీ అధ్యక్షుడు రామప్ప అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తాలూకా పంచాయతీ ఈఓ కే మంజునాథ్, సీడీపీఓ కవిత, హందేనహళ్ళి గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామాంజనేయ రథోత్సవం

శిడ్లఘట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హెచ్‌క్రాస్‌లో కొలువైన సీతారామాంజనేయ స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే రవికుమార్, తాలూకా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి హేమావతి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ధ్వజారోహణ, అలంకార సేవ, రథోత్సవం, అంకురార్పణ, రక్షాబంధన, హనుమంత సేవ, మహాభిషేకం, పల్లకీ ఉత్సవం, విద్యుత్ దీపాలంకరణ, శయనోత్సవం, గరుడోత్సవం, ఇతర ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కోలారు-చిక్కబళ్ళాపుర మెయిన్‌రోడ్డులోని హెచ్‌క్రాస్‌లో ఆలయం ఉండడంతో చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రథోత్సవం ఊరేగుతుండగా భక్తులు అరటిపండు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో శిడ్లఘట్ట కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ రాజీవ్‌గౌడ, బీజేపీ నాయకుడు రామచంద్రగౌడ, రైతు నాయకుడు భైరేగౌడ, సోమణ్ణ, మునేగౌడ, అనంత పద్మనాభాచారి, కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆల్మట్టిలో 522 మీటర్ల నీటి నిల్వకు కుట్ర

» బీజేపీ ఎంపీ గోవింద కారజోళ ఆగ్రహం

» రేపు బాధిత రైతుల నిరసన

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లాలోని ఆల్మట్టి జలాశయంలో 522 మీటర్లకే నీటి నిల్వలను నిలిపేలా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని బీజేపీ ఎంపీ గోవింద కారజోళ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగల్కోటెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆల్మట్టి జలాశయంలో 522 మీటర్లకు మాత్రమే నీటి నిల్వలు ఉంచుతామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసేందుకు సిద్ధమైందన్నారు. ఆల్మట్టి జలాశయంలో 524.256 మీటర్ల వరకు నీటిని నిల్వ ఉంచి ఉత్తర కర్ణాటకలోని ఐదు జిల్లాల్లో 15లక్షల ఎకరాల భూమికి సాగునీరు సమకూర్చాల్సి ఉండేదన్నారు. సుప్రీంకోర్టులో 522 మీటర్లకు మాత్రమే నీటి నిల్వలు ఉంచుతామని అఫిడవిట్ ద్వారా ఉత్తర కర్ణాటక ప్రజలకు భారీ ద్రోహం చేశారన్నారు. అప్పర్ కృష్ణ ప్రాజెక్టు ట్రిబ్యునల్ ప్రకారం ఆల్మట్టి జలాశయంలో 130 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకునే వీలుందన్నారు. ఇందుకోసం ముంపునకు గురయ్యే 20 గ్రామాలను స్థలమార్పిడి చేసి వారికి భూస్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఒక ఎకరం భూమి కూడా స్వాధీనం చేసుకునేందుకు సిద్ధం కాలేదన్నారు. నివాసాలకు పరిహారం ఇవ్వలేదన్నారు. బసవరాజ్ బొమ్మై పాలనలో 524 మీటర్ల నీటి నిల్వకు అనుగుణంగా 26వేల ఎకరాల ప్రదేశాన్ని భూస్వాధీనం చేసుకుని పరిహారం విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం పునరావాసం కోసం రూ.1900 కోట్లు వాపసు తీసుకున్నారని ఇది ఉత్తర కర్ణాటక పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న అభిమానంగా భావించాలా అని ప్రశ్నించారు. 2013 నుంచి 2018వరకు సిద్ద రామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 7795 కోట్ల రూపాయలు, జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలో రూ.1079 కోట్లు, యడియూరప్ప నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రూ.6407 కోట్లు ఖర్చు చేసిందని, ప్రస్తుతం సిద్దరామయ్య కేవలం రూ.548 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. బాగల్కోటెలో మంగళవారం బాధిత రైతులు పోరాటానికి సిద్ధమవుతున్నారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి కారణమన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన భూములు, ఇళ్లు కోల్పోయేరైతులను రోడ్డుపైకి నెట్టేయడం సరికాదన్నారు. కాగా ఆల్మట్టి జలాశయంలో 522 మీటర్ల వరకు మాత్రమే సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వంపై రైతులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



మీడియాతో ఎంపీ గోవింద కారజోళ

ప్రతిభతోనే ఉన్నతస్థాయికి..



ప్రతిభాపురస్కారాల కార్యక్రమంలో సుధీంద్ర తదితరులు

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతిభతోనే ఉన్నతస్థాయికి విద్యార్థులు ఎదగడం సాధ్యమని రాష్ట్ర బయో ఇంధన వనరుల అభివృద్ధి మండలి ఛైర్మన్ ఎస్ఈ సుధీంద్ర అభిప్రాయపడ్డారు. కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ ఆదివారం మల్లేశ్వరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అశ్వత్థనారాయణ, మైసూరు ఎంపీ యదువీర్, ఎమ్మెల్సీ డీఎస్ అరుణ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీంద్ర మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మరిన్ని మార్పులు అవసరమని విద్యార్థులకు ప్రభుత్వంతోపాటు ప్రజాసంఘాలు, కులసంఘాలు చేయూతనిచ్చే విధానం మంచి పరిణామమన్నారు. ఎంపీ యదువీర్ మాట్లాడుతూ మైసూరులో యూనివర్సిటీ వందేళ్లక్రిందటే నిర్మించడం ద్వారా లక్షలాదిమందికి ఉన్నత విద్య, జ్ఞానం అందించినట్టు అయ్యిందన్నారు. అశ్వత్థనారాయణ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య మహాసభతో మాకు దశాబ్దాలకాలంగా సంబంధం ఉందన్నారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆర్‌పి రవిశంకర్ మాట్లాడుతూ 14ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. వాసవి కో-ఆపరేటివ్ బ్యాంకు, వాసవి క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ వంటి సంస్థలతో అనుగుణంగా అంతర్జాతీయస్థాయిలో విద్యాసంస్థలను ఏర్పాటు చేయదలిచామన్నారు. కార్యక్రమంలో గోవిందరాజులు, రఘువీర్, పుత్తురాయ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూ, డిగ్రీ, వృత్తివిద్యా కోర్సులలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు.

10న చలో విజయవాడ

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని ఈ నెల 10న చలో విజయవాడ నిర్వహించనున్నట్లు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ప్రేమనాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానంటూ హామీ ఇచ్చి ఉద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టిందని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు సీపీఎస్ విధానంపై ఏడాదిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని, నారా లోకేష్ సైతం ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధా నం అమలు చేయడం రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రామన్న, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు మంత్రి అభినందన



క్రీడాకారులతో మంత్రి సుధాకర్

చింతామణి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మినీ ఒలింపిక్స్‌లో కబడ్డీ పోటీలలో చింతామణి తాలూకాకు ఒక బంగారు, ఒక వెండి పతకం సాధించడంపై క్రీడాకారులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ప్రత్యేకంగా అభినందించారు. బెంగళూరు కంఠీరవ స్టేడియంలో నవంబరు 22న అండర్14 విభాగంలో మూడో మినీ ఒలింపిక్స్ పోటీలలో చింతామణి తాలూకా కైవారకు చెందిన అజ్వా ఫిర్దాస్ హావేరి జిల్లా జట్టులోనూ, జోడిహోసహళ్ళికి చెందిన గీతా బెంగళూరు గ్రామీణ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వరుసగా బంగారు, వెండి పతకం సాధించడం ద్వారా జిల్లా, తాలూకా కీర్తిని ఇనుమడింపచేశారని క్రీడాకారులను, కోచ్ శేఖర్‌ను, చిక్కబళ్ళాపుర జిల్లా జాయింట్ కార్యదర్శి చింతామణి మంజునాథ్‌లను మంత్రి అభినందించారు.

తుఫాను ప్రభావంతో పలుచోట్ల వర్షాలు



వర్షంలోనే కూరగాయల కొనుగోళ్లు

బంగారపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావం కోలారు జిల్లావ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు కురిశాయి. బంగారపేట తాలూకాలో శని, ఆదివారాలలో తుంపర వర్షం కురిసింది. ఐదారు రోజులుగా మబ్బులు కమ్మి ఉండగా వర్షం కారణంగా ప్రధాన బజారుతోపాటు ఏపీఎంసీ కూరగాయల మార్కెట్ ప్రాంతాలు బోసిపోయాయి. జనజీవనం అస్తవ్యస్థమైంది. పాలు, దినపత్రికలు అమ్మేవారు, వీధి వ్యాపారులు, చిల్లర దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాలూకాలో ఎక్కువగా రాగి సాగు చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో కోత దశలో ఉన్న పంట దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. దేశిహళ్ళికి చెందిన రైతు ప్రవీణ్‌గౌడ మాట్లాడుతూ కోత దశలో రాగి పంట ఉందని, వర్షం కారణంగా కూలీలతోగానీ, హార్వెస్టింగ్ యంత్రాలతోగానీ పంటకోతకు ఇబ్బంది ఏర్పడనుం దన్నారు. పంట దిగుబడి బాగున్నా చేతికి వస్తుందో లేదో అనే దిగులు ఉందన్నారు.



రాగి పంటను చూపుతున్న రైతు ప్రవీణ్‌గౌడ

వైభవంగా లక్ష దీపోత్సవం

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా ధర్మస్థళ మంజునాథ స్వామి ఆలయంలో కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకుని శనివారం రాత్రి లక్ష దీపోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద వీధులలోదీపాలు వెలిగించారు. మూలవిరాట్టుకు మహాపర్వ పేరిట విశేషపూజలు నిర్వహించారు. డొళ్ళుకుణిత, కోలాట, వీరగాసె సహా వివిధ వెయ్యికిపైగా కళాబృందాల జట్లు పాల్గొని సందడి చేశారు. భక్తుల ద్వారానే అన్నదాసోహం నిర్వహిం చడం విశేషం. ఆదివారం కూడా భక్తుల సందడి నెలకొంది. అమృత వర్షిణి సభాంగణంలో ధర్మాధికారి డీ వీరేంద్రహెగ్గే మార్గదర్శకంలో 92వ ధర్మస్థళ సాహిత్య సమ్మేళనం జరిగింది. విద్వాంస శతావధాని ఆర్ గణేశ్ ప్రారంభించగా విద్వాంసుడు పాదెకల్లు విష్ణుభట్ట అధ్యక్షత వహించారు. కన్నడ రిటైర్డు ప్రాధ్యాపకులు బెంగళూరుకు చెందిన ప్రమీళా మాధవ, మైసూరుకు చెందిన బీవీ వసంత కుమార్, ప్రొఫెసర్ మల్లికార్జున తదితరులు సమ్మేళనంలో ప్రసంగించారు.

హిందువులకు రక్షణ కల్పించాలి

» ఇస్కాన్ భక్తుల డిమాండ్

బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలనే డిమాండ్‌తో రాజాజీనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో భక్తులు నిరసన చేపట్టారు. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ గురువును కేసులు, అరెస్టులతో వేధిస్తున్నారని ఆ తర్వాతి పరిణామాలతో ఎంతోమంది హిందువులపై విచక్షణా రహితంగా దాడులు చేశారని స్థానిక ఇస్కాన్ ముఖ్యుడు, అక్షయపాత్ర ఫౌండేషన్ ఛైర్మన్ మధుపండితదాస ఆక్రోశం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అక్కడి కోర్టులు ఇస్కాన్‌ను కట్టడి చేయలేమని సూచించిందన్నారు. అయినా దౌర్జన్యంతో దాడులు చేస్తున్నారన్నారు. వెంటనే ఇస్కాన్ గురువును వదిలిపెట్టకపోతే తీవ్రస్థాయిలో పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వందలాదిమంది ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు కృష్ణశాస్త్రి కన్నుమూత



కృష్ణశాస్త్రి (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా ఆర్ఎస్ఎస్ ప్రముఖుడిగా గుర్తింపు పొందిన చేపూరు కృష్ణశాస్త్రి (101) కన్నుమూశారు. ఆనేకల్‌లో నివసిస్తున్న కృష్ణశాస్త్రి వయోభారం సమస్యలతో బాధపడుతూ శనివారం తుది శ్వాస వీడారు. ఆనేకల్‌లో ఆర్ఎస్ఎస్ శాఖను ఆవిర్భవించి సుదీర్ఘకాలం సేవలందించారు. 'ఎమర్జెన్సీ' విధించిన వేళ జైలుశిక్ష అనుభవించారు. ఐదుగురు కుమారులు, ఆరుమంది కుమార్తెలతోపాటు మనవళ్లతోపాటు అపారమైన కుటుంబీకులు ఉన్నారు. ఆయన మనవడు ఆయుర్వేద వైద్యులు సీఏ కిశోర్ మాట్లాడుతూ జీవితకాలం ఆర్ఎస్ఎస్ కోసం పాటుపడ్డారన్నారు. కృష్ణశాస్త్రి అంత్యక్రియలు ఆదివారం వారి తోటలో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ముఖ్యులతోపాటు కేంద్రమాజీ మంత్రి నారాయణస్వామి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వణికించిన చలి

» మబ్బులు, మేఘాలతో అలజడి

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరాన్ని చలి వణికించింది. ఫెంగల్ తుఫాను ప్రభావంతో నగరవ్యాప్తంగా శనివారం రాత్రి ఆరంభమైన తేలికపాటి వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రిదాకా మబ్బులు మేఘాలతో అలజడి సృష్టించింది. నగరంలో 20 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రత పడిపోయింది. దీంతో చల్లటిగాలులు, తుంపర వర్షాలు కురిశాయి. రాష్ట్రమంతటా దాదాపు ఇదే తరహా వాతావరణం కొనసాగింది. అయితే తీరప్రాంత జిల్లాలు ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో వర్షం కురిసింది.



విధానసౌధ వద్ద ఇలా...

క్యాన్సర్ నియంత్రణకు మరిన్ని పరిశోధనలు అవసరం

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో క్యాన్సర్ ప్రభావం పెరుగుతోందని నియంత్రణకు మరిన్ని పరిశోధనలు అవసరమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు అభిప్రాయపడ్డారు. నగరంలో సైటూట్రాన్ టెక్నాలజీ ఏర్పాటు చేసిన నెక్స్‌జెన్ క్యాన్సర్ కేర్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దినేశ్‌గుండూరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్సల ద్వారా నయం చేయవచ్చునని వైద్యనిపుణుల అభిప్రాయంగా ఉందన్నారు. దీన్నిబట్టి చికిత్సలకంటే ముందు పరీక్షలకు ప్రాధాన్యత పెరగాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర వైద్య పరీక్షలు జరిపేలాంటి పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. సైటూట్రాన్ పరిశోధకులు రాజా విజయకుమార్, గ్లెనిగల్స్ కౌలాలంపూర్ వైద్యనిపుణులు లింయు చింగ్, అమెరికాకు చెందిన శ్రేస్ స్కెలన్ సీఈఓ మీనా అగస్టిన్, ఏహెచ్‌పి అంకాలజిస్ట్ దీపక్ రౌత్రెలతోపాటు గ్లియా ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మెడికల్ డైరెక్టర్ అంజనా నాయర్‌లు సదస్సులో వారి అభిప్రాయాలు తెలిపారు.